సాక్షి
శ్రీకాకుళం

శనివారం । 25 । మే । 2024



కాశీబుగ్గలో భారీ చోరీ

కాశీబుగ్గ రోటరీనగర్‌లో గురువారం రాత్రి భారీ చోరీ జరిగింది. సుమారు రూ.45 లక్షల విలువైన సొత్తును దొంగలు పట్టుకుపోయారు.

- 8లో



ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

వజ్రపుకొత్తూరు మండలం వెంకటాపురం జీడి తోటల్లో ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

- 8లో

యువతకు శిక్షణ

నరసన్నపేట: విశ్వహిందూ పరిషత్ యువ విభాగం దుర్గావాహినీ ఆధ్వర్యంలో శ్రీకాకుళం రూరల్ మండలం మునసబుపేటలోని గాయిత్రీ కళాశాలలో ఈ నెల 25 నుంచి 31 వరకు రాష్ట్ర స్థాయి శౌర్యప్రశిక్షణా శిబిరాలు నిర్వహిస్తున్నట్లు దుర్గావాహిని ప్రముఖ్ సింహాద్రి హైందవి ఒక ప్రకటనలో తెలిపారు. 16 నుంచి 36 ఏళ్ల యువతకు యోగా, ప్రాణాయామం, కరాటే వంటి విభాగాల్లో శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

క్యాంపస్ డ్రైవ్‌లో 131 మంది ఎంపిక



ధ్రువీకరణ పత్రాలతో యువత

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రం (ఐటీఐ)లో శుక్రవారం నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో 131 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. 13 కంపెనీల ప్రతినిధులు హాజరై 322 మంది అభ్యర్థులను ఇంటర్వ్యూ చేశారు. విద్యార్హత, నైపుణ్యాలు ఆధారంగా ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ప్రిన్సిపాల్ ఎల్.సుధాకరరావు, ప్లేస్‌మెంట్ అధికారి కామేశ్వరరావు పర్యవేక్షించారు.

స్ట్రాంగ్ రూమ్‌ల పరిశీలన



గార్డు రిజిస్టర్ పరిశీలిస్తున్న అదనపు ఎస్పీ ప్రేమ్‌కాజల్

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలెంలోని శ్రీశివానీ ఇంజినీరింగ్ కాలేజీలో ఏర్పాటు చేసిన ఈవీఎంల స్ట్రాంగ్‌రూమ్‌లను శుక్రవారం అదనపు ఎస్పీ జి.ప్రేమ్‌కాజల్ పరిశీలించారు. సీసీ కెమెరాల ఫుటేజ్ పరిశీలించి భద్రతపై గార్డులకు పలు సూచనలు చేశారు. నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు.

ఏఓబీ సరిహద్దులో కార్డన్ సెర్చ్



తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

పాతపట్నం: రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన పాతపట్నం మండలం బూరగాంలో శుక్రవారం పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. పాతపట్నం సీఐ నల్లి సాయి ఆధ్వర్యంలో పాతపట్నం, మెళియాపుట్టి ఎస్‌ఐలు మహమ్మద్ యాసీన్, రాజేష్, ఎస్‌టీఎఫ్ పోలీసులు, సివిల్ పోలీసులు ఇంటింటా తనిఖీలు నిర్వహించారు. వాహనాల ధ్రువపత్రాలు, గుర్తింపు కార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ యాసీన్ మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులు కనిపిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు.

ఏపీపీఎస్సీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో గణపతిరావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఈ నెల 25 నుంచి నిర్వహించే డిప్యూటీ ఎడ్యుకేషన్ అధికారులు, ఏపీ ఎడ్యుకేషన్ సర్వీసెస్ ఉద్యోగాల పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు తెలిపారు. పరీక్షల నిర్వహణపై శుక్రవారం శ్రీకాకుళంలోని తన చాంబర్‌లో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎచ్చెర్లలోని శివానీ ఇంజినీరింగ్, వేంకటేశ్వర ఇంజినీరింగ్, బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం, నరసన్నపేటలోని గొట్టిపల్లి కోర్ టెక్నాలజీస్, టెక్కలి ఆదిత్యా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కేంద్రాలుగా పరీక్షలు జరుగుతాయని వివరించారు. 830 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని తెలిపారు. అభ్యర్థులను ఉదయం 7.30 గంటల నుంచి అనుమతిస్తామని, 8.30 తరువాత వచ్చిన వారికి అనుమతి ఉండదని స్పష్టం చేశారు. ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని చెప్పారు. 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, సమీపంలో జెరాక్స్ సెంటర్లు మూసివేయాలని సూచించారు. పరీక్ష కేంద్రంలోకి సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదన్నారు. సమావేశంలో సెక్షన్ అధికారి ఎం.బాలరాజు, సహాయకులు పద్మప్రియ, వైద్య, విద్యుత్ శాఖ అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కడలి మమకారం.. మనిషి సహకారం.. వెరసి కూర్మావతారం

క్షీర సాగర మథనం నిర్విఘ్నంగా పూర్తి కావడానికి శ్రీమహావిష్ణువు కూర్మరూపంలో అవతరించగా.. ఆ రూపాన్ని మరెక్కడా లేని తీరులో మూలవిరాట్టుగా ప్రతిష్టించి అర్చిస్తున్న విశిష్టత మన జిల్లాలో గోచరిస్తుంది. ఆధ్యాత్మిక భావానికి పరాకాష్టగా కూర్మనాథుడి ఆరాధనను చెప్పుకుంటే.. ఈ కాలంలో అందుకు ఏమాత్రం తీసిపోని మరో మానవీయ సేవ తీరప్రాంతంలో నిర్విఘ్నంగా సాగిపోతోంది. అరుదైన ఆలివ్ రిడ్లే తాబేళ్ల సంతతిని పరిరక్షించడానికి.. వాటి గుడ్లను సేకరించి.. ప్రత్యేకించి పొదిగించి.. మళ్లీ సముద్రంలో లక్షలాది చిరుజీవులను విడిచిపెట్టే గొప్ప ప్రయత్నం నిరతం సాగుతోంది. అటవీ శాఖ, ట్రీ ఫౌండేషన్ చేస్తున్న ఈ మంచి ప్రయత్నం సముద్రం చేయూతతో ప్రశంసనీయ రీతిలో నడుస్తోంది.

- అద్భుత ప్రయాణం.. ఆలివ్ రిడ్లే తాబేళ్ల ప్రస్థానం
- జిల్లాలో 16 హ్యాచరీలతో అరుదైన జాతి సంరక్షణకు యత్నం
- 1,59,275 గుడ్లు సేకరణ.. సాగరంలోకి 95,696 చిట్టి తాబేళ్లు

ఒక్కో తాబేలు పెట్టే గుడ్ల సంఖ్య: **30** నుంచి **140**

పొదిగే కాలం: **45** నుంచి **70** రోజులు

28 నుంచి **30** డిగ్రీల ఉష్ణోగ్రత వద్ద పొదిగిన పిల్లలు మగ తాబేళ్లుగా పరిగణిస్తారు.

30-32 డిగ్రీల ఉష్ణోగ్రత వద్ద పొదిగిన పిల్లలు ఆడ తాబేళ్లుగా పరిగణిస్తారు.

ఈ ఏడాది ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా సేకరించిన గుడ్లు **1,59,275**

ఇప్పటి వరకు సాగరంలోకి విడిచిపెట్టిన తాబేళ్లు: **95,696**

జిల్లా వ్యాప్తంగా తాబేళ్ల సంరక్షణ కేంద్రాలు: **16**

సంరక్షణకు పనిచేస్తున్న వలంటీర్లు: **41**



వజ్రపుకొత్తూరు రూరల్:

సముద్ర జీవుల్లో అరుదైన ఉభయచర జీవులు ఆలివ్ రిడ్లే తాబేళ్లు. ఇవి పసిఫిక్ మహాసముద్రం నుంచి హిందూ మహాసముద్రం వరకు కనిపిస్తూ ఉంటాయి. జపాన్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, వెనిజులా, గల్ఫ్ తదితర 80 దేశాలతో పాటు మనకు వేల నాటికల్ మైళ్ల దూరంలో గంగమ్మ ఒడిలో ఒదిగి ఉంటున్నాయి. తమ సంతతిని వృద్ధి పరిచే లక్ష్యంతో తీరానికి లక్షల సంఖ్యలో చేరుకుంటాయి. మాతృత్వాన్ని పొందేందుకు ప్రకృతిని(తీరాన్ని) ఆవాసాలుగా మార్చుకుంటాయి. అలాంటి ఆలివ్ రిడ్లే తాబేళ్ల సంతతికి శ్రీకాకుళం జిల్లా సముద్ర తీరం పుట్టినిళ్లుగా నిలుస్తోంది.


భద్రంగా కాపాడుతూ..

జిల్లాలో 193 కి.మీ. విశాల సముద్ర తీరం ఉండటంతో ఆలివ్ రిడ్లే తాబేళ్లు తమ సంతతి సంరక్షణకు నిలయంగా మార్చుకుంటున్నాయి. వీటికి అటవీ అధికారులు, ట్రీ ఫౌండేషన్ ప్రతినిధులు రక్షణగా నిలుస్తున్నారు. జిల్లాలో 16 సంరక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసి జీవం పోస్తున్నారు. 41 మంది వలంటీర్లను నియమించి వారి ద్వారా గుడ్లు సేకరిస్తున్నారు. తల్లి తాబేళ్లు ఇసుక తిన్నెలలో పెట్టిన గుడ్లు పక్షులు, జంతువులు, దొంగల బారిన పడకుండా భద్రపరుస్తున్నారు. తీరంలో ఏర్పాటు చేసిన హేచరీలలో గుడ్లను పొదిగించి బుల్లి తాబేళ్లను సురక్షితంగా సముద్రంలో విడిచిపెడుతున్నారు.



సముద్రంలోకి వెళ్తున్న బుల్లి తాబేళ్లు

సంరక్షణ కేంద్రాలు ఎక్కడెక్కడ..



వజ్రపుకొత్తూరులో ఏర్పాటు చేసిన సంరక్షణ కేంద్రం

- జిల్లా వ్యాప్తంగా 16 హ్యాచరీలు(తాబేళ్ల సంరక్షణ కేంద్రాలు)ఉన్నాయి.

వజ్రపుకొత్తూరు సెక్షన్: వజ్రపుకొత్తూరు, మెట్టూరు

- **బారువ సెక్షన్:** కళింగపట్నం, గడ్డివూరు, బట్టిగల్లూరు, బారువ, ఇసుకవానిపాలెం
- **కవిటి సెక్షన్:** డొంకూరు, చేపల కపాసుకుద్ది, బట్టివానిపాలెం
- **శ్రీకాకుళం సెక్షన్:** కొచ్చెర్ల, గంగులవానిపేట
- **టెక్కలి సెక్షన్:** గుల్లవానిపేట, కుముందివానిపేట, మేఘవరం, భావనపాడు

పక్కాగా సంరక్షణ



తీరంలో తాబేళ్లు పొదిగిన గుడ్లను ఎలుగులు, నక్కలు, పక్షులు తినకుండా ట్రీ ఫౌండేషన్, యువకులు, మత్స్యకారుల సహకారంతో సంరక్షిస్తున్నాం. అరుదైన తాబేళ్ల జాతిని కాపాడుతున్నాం. ఇప్పటికే వేల సంఖ్యలో బుల్లి తాబేళ్లను సముద్రంలోకి విడిచిపెట్టాం.

– మురళీకృష్ణనాయుడు, అటవీ శాఖాధికారి, కాశీబుగ్గ రేంజ్

రాత్రివేళల్లో గుడ్లు సేకరణ..

- ఏటా జనవరి నుంచి మార్చి వరకు తల్లి తాబేళ్ల గుడ్లు పెడుతుంటాయి.
- ఈ సమయంలో రాత్రి 10 నుంచి వేకువజాము 5 గంటల్లోపు తీరానికి చేరుకుంటాయి.
- ఈ సమయంలోనే ఇసుక తిన్నెలలో బొరియలు చేసి గుడ్లను పెట్టి సముద్రంలోకి తిరిగి వెళ్లిపోతాయి.
- వలంటీర్లు రాత్రి సమయంలోనే టార్చిలైట్, సంచులు పట్టుకుని తీరంలో తిరుగుతూ గుడ్లు సేకరిస్తారు.
- వాటిని సంరక్షణ కేంద్రంలో అధికారుల సమక్షంలో భద్రపరుస్తారు.

ఉద్యమంలా సేకరణ..

పాతికేళ్లుగా ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఒడిశా, తమిళనాడు ఇతర రాష్ట్రాల్లో ఆలివ్ రిడ్లే తాబేళ్ల గుడ్ల సేకరణ ఉద్యమంలా సాగుతోంది. అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, యువకులు, మత్స్యకారుల సాకారంతో లక్షలాది గుడ్లను హ్యాచరీలలో సంరక్షించి పొదిగిన తర్వాత బుల్లి తాబేళ్లను తిరిగి సముద్రంలో విడిచిపెడుతున్నారు. ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా తాబేలు గుడ్ల సేకరణ యజ్ఞంలా సాగింది.



తాబేళ్ల గుడ్లను సేకరిస్తున్న వలంటీర్లు



బుల్లి తాబేళ్లను సముద్రంలోకి వదులుతున్న అటవీ శాఖాధికారులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

అరుదైన జాతిని కాపాడుకుందాం



సముద్ర జీవులలో అరుదైన ఆలివ్‌రిడ్లే తాబేళ్ల రక్షణ సామాజిక బాధ్యతగా తీసుకోవాలి. రాత్రి వేళల్లో తీరం వెంబడి తిరుగుతూ వలంటీర్ల సహకారంతో గుడ్లను సేకరించి సంరక్షిస్తున్నాం. పొదిగిన బుల్లి తాబేళ్లను అటవీ శాఖా అధికారులు సహాయంతో మళ్లీ సముద్రంలోకి విడిచిపెడుతున్నాం.

– కె.సోమేశ్వరరావు, ట్రీ ఫౌండేషన్ జిల్లా కో ఆర్డినేటర్

కథా నిలయం

- అందుబాటులో 16 వేలకు పైగా పుస్తకాలు
- కథా పరిశోధకుల నిలయంగా ఖ్యాతి
- కారా మాస్టారి కృషితో ఏర్పాటు

శ్రీకాకుళం కల్చరల్:

కథా నిలయం.. సాహితీ ప్రపంచంలో శ్రీకాకుళం జిల్లాకు ప్రత్యేక స్థానం కల్పించిన చోటుగా ప్రసిద్ధి పొందింది. ఎక్కడ కథ ప్రచురితమైనా ఇక్కడికి వచ్చి చేరుతూ వేలాది కథల పుస్తకాలతో విరాజిల్లుతోంది. పుస్తకాలు భద్రపరిచేందుకు ప్రత్యేకంగా భవనం ఉండాలన్న ఉద్దేశంతో జిల్లాకు చెందిన ప్రముఖ రచయిత దివంగత కాళీపట్నం రామారావు మాస్టారు, మరికొంత మంది ఆత్మీయులు కలిసి 1997 ఫిబ్రవరిలో శ్రీకాకుళంలోని విశాఖ ఏ కాలనీలో సూర్యానగర్‌లో రెండంతస్తుల భవనంలో కథా నిలయాన్ని ప్రారంభించారు. కేవలం పుస్తకాలను భద్రపరచడమే కాకుండా వెబ్‌సైట్ ద్వారా కూడా కథలు చదువుకునేందుకు వీలుగా చర్యలు తీసుకున్నారు.

కథలు-రచయితలు



కథకుల చిత్రపటాలు


మొదటగా 800 పుస్తకాల సేకరణతో ప్రారంభమై ప్రస్తుతం 16 వేలకు చేరాయి. 24 వేలు పత్రికలు ఉన్నాయి. సంకలనాలు, కథా సంపుటాలు కలిపి మరో 5వేలు ఉన్నాయి. 100 ఫీచర్ రచనలు, 105 వ్యాస సంకలనాలు, 67 ఆత్మకథలు, 97 పరిశోధనా పత్రాలు, 95 జీవిత చరిత్రలు, 130 సాహిత్య సర్వస్వాలు, 53 ఉపయుక్త గ్రంథాల సూచికలు, 45 ఇతర భాషల్లో వచ్చిన తెలుగు పుస్తకాలు, 8200 ఇతర పుస్తకాలు సేకరించారు. 15 వేల కథా రచయితలకు చెందినవి సేకరించారు. ఇక్కడ ప్రముఖ కథా రచయితల ఫోటోలు 285కు పైగా సేకరించి భద్రపరిచారు. సుమారు 40మంది రచయితల స్వరాలను రికార్డు చేశారు. అందుకు ఆల్‌ఇండియా రేడియో సహకారం అందించింది.

చూసొద్దాం రండి



కథా నిలయం

డిజిటలైజేషన్ ప్రక్రియ..



కథానిలయంలో ఉన్న పుస్తకాలు

ఆధునిక అవసరాలకు అనుగుణంగా కథలను దూరప్రాంతాల సాహిత్యాభిమానులకు అందించేందుకు వీలుగా డిజిటలైజేషన్ పనులు జరిగాయి. పాతపత్రికలను స్కానింగు చేసి పీడీఎఫ్‌లో మార్చారు. 1885 నాటి అమృత గ్రంథచింతామణి, 1895 నాటి 'శారద', 1896 నాటి చింతామణి, 1920 నాటి గురజాడ రచనలు, బండారు అచ్చమాంబ రచనలు, 'హిందూ సుందరి' వంటి పత్రికలు కూడా ఆన్‌లైన్‌లో లభ్యమవుతున్నాయి. మొత్తం 88వేల కథలను ఇంటర్నెట్‌లో చక్కగా చదువుకోవచ్చు. 'కథానిలయం డాట్‌కామ్' వెబ్‌సైట్ ద్వారా 13వేల కథలు డౌన్‌లోడ్ చేసి చదువుకోవచ్చు.

సందర్శన వేళలు...

కథా నిలయాన్ని సందర్శించాలనుకుంటే ప్రతి రోజూ సాయంత్రం 5.30 నుంచి రాత్రి 7.30 గంటల మధ్య రావచ్చని ట్రస్టు సభ్యులు కాళీపట్నం సుబ్బారావు తెలిపారు. ముందుగా 94900 08743 నెంబరుకు ఫోన్ చేసి రావాలని కోరారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 51 కేంద్రాల్లో తొలిరోజు తెలుగు, సంస్కృతం, హిందీ పరీక్షలు నిర్వహించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు ప్రథమ సంవత్సరం, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ద్వితీయ సంవత్సరం విద్యార్థులు పరీక్షలు రాశారు. తొలి రోజు ఫస్టియర్ విద్యార్థులు 3422 మందికి గాను 176 మంది గైర్హాజరయ్యారు. సెకెండియర్ విద్యార్థులు 926 మందికి గాను 80 మంది గైర్హాజరయ్యా రు. డీవీఈవో కోట ప్రకాశరావు, ఆర్‌ఐవో ప్రగడ దుర్గారావు, డీఈసీ కమిటీ సభ్యులు బొమ్మలాట శ్యామ్ సుందర్, గూణ సింహాచలం, కీర్తి తవిటినాయుడు పర్యవేక్షించారు. మూడు ఫ్లయింగ్, రెండు సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీలు చేపడుతున్నారు.

పొరపాట్లకు తావులేకుండా కౌంటింగ్

- కచ్చితమైన అవగాహనతో హాజరుకావాలి
- సిబ్బంది శిక్షణ తరగతుల్లో కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్



మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: కౌంటింగ్ ప్రక్రియపై సిబ్బంది సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్ స్పష్టం చేశారు. 2024 సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ వచ్చే నెల 4న జరగనున్నందున, ఈ ప్రక్రియలో అనుసరించాల్సిన విధి విధానాలపై శుక్రవారం శ్రీకాకుళం అంబేడ్కర్ ఆడిటోరియంలో కౌంటింగ్ సూపర్‌వైజర్లు, మైక్రో పరిశీలకులు, కౌంటింగ్ అసిస్టెంట్లు తదితర సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ విజయవంతమైందని, కౌంటింగ్ కూడా అదే స్థాయిలో నిర్వహించాలన్నారు. కచ్చితమైన, సమర్థవంతమైన ఓట్ల లెక్కింపునకు అవసరమైన నైపుణ్యాలు, మెలకువలు నేర్చుకుని కౌంటింగ్‌కు సిద్ధం కావాలన్నారు. ఈవీఎంల లెక్కింపు కంటే ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు జరుగుతుందని చెప్పారు. రాజకీయ పార్టీల ఏజెంట్ల సందేహాలు తీర్చుతూ, ఓపికగా సిబ్బంది మెలగాలన్నారు. కౌంటింగ్ పూర్తయ్యే వరకు సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా కౌంటింగ్ నిర్వహించాలన్నారు. అనంతరం మాస్టర్ ట్రైనీలు మాట్లాడుతూ కౌంటింగ్ విధి విధానాలు వివరించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, మాస్టర్ ట్రైనీలు కిరణ్, ఎస్.బాలాజీ, మెప్మా పీడీ కిరణ్‌కుమార్, శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

అల్లర్లు చెలరేగకుండా పటిష్ట భద్రత

- కౌంటింగ్ కేంద్రం వద్ద మూడంచెల భద్రతా ఏర్పాట్లు
- పోలీసు అధికారుల సమీక్షలో ఎస్పీ రాధిక





మాట్లాడుతున్న ఎస్పీ రాధిక, సమావేశంలో పాల్గొన్న డీఎస్పీలు, సీఐలు

శ్రీకాకుళం క్రైమ్ : కౌంటింగ్ సమయంలో ఎటువంటి అల్లర్లు చెలరేగకుండా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎస్పీ జి.ఆర్.రాధిక తెలిపారు. ఓట్ల లెక్కింపు నాడు తీసుకోవాల్సిన చర్యలు, బందోబస్తు ఏర్పాట్లపై డీఎస్పీలు, సీఐలతో శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు (కౌంటింగ్) ప్రక్రియ జూన్ 4న ఎచ్చెర్ల మండలం చిలకపాలెంలోని శ్రీశివానీ ఇంజినీరింగ్ కళాశాల స్ట్రాంగ్ రూమ్ వద్ద జరగనుందని, అక్కడ ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కేంద్ర బలగాలు, జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్, సివిల్ పోలీసులతో మూడంచెల బందోబస్తు ఏర్పాట్లు చేపడుతున్నామన్నారు. కేంద్రాల వద్ద ట్రాఫిక్ రెగ్యులేషన్, వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేకంగా చర్యలు చేపట్టాలన్నారు. 144 సెక్షన్ పక్కాగా అమలు చేస్తూ ప్రజలు గూమిగూడకుండా చూడాలన్నారు.కేంద్రాల్లోకి వెళ్లే కౌంటింగ్ ఏజెంట్లను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, రిటర్నింగ్ అధికారి జారీ చేసిన అనుమతిపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాకే లోపలకు అనుమతించాలన్నారు. ఫలితాలు వెల్లడైన తర్వాత జిల్లాలో ఎటువంటి అల్లర్లు చెలరేగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. విజయోత్సవ ర్యాలీలు, బాణాసంచా పేలుళ్లకు ఎటువంటి అనుమతులు లేవని స్పష్టం చేశారు. శాంతియుతంగా కౌంటింగ్ పూర్తయ్యేలాగా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఎస్పీ ఆదేశించారు. సమావేశంలో అదనపు ఎస్పీలు ప్రేమ్‌కాజల్, ఉమామహేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.



కూర్మనాథాలయంలో పుష్పయాగం

శ్రీకూర్మంలో కూర్మనాథుని కల్యాణ ముగింపు ప్రక్రియలో భాగంగా శుక్రవారం సాయంత్రం అనివెట్టి మంటపంలో పుష్పయాగం నిర్వహించారు. పలు రకాల పుష్పాలతో పాటు ఆహార పదార్థాలను స్వామివారికి నివేదించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో జి.గురునాథం, ప్రధానార్చకులు చామర్తి సీతారామనృసింహాచార్యులు, అర్చకులు లక్ష్మీనరసింహాచార్యులు, దాసుబాబు, పద్మనాభాచార్యులు, కిషోర్‌బాబు, శ్రీనివాసాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

–గార

క్లుప్తంగా

ఇద్దరిపై కేసు నమోదు

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలోని పొన్నాడ పంచాయతీ వెంకన్నగారిపేటలో వ్యక్తిగత కక్షల నేపథ్యంలో పొలం వద్ద నాగరాజు అనే వ్యక్తిపై శుక్రవారం దాడి జరిగింది. బాధితుడి ఫిర్యాదు మేరకు తల్లి, కుమారుడు చుక్క అసిరితల్లి, రమేష్‌లపై ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేశారు. క్షతగాత్రుడు రిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు.

కుశాలపురంలో గ్రామదేవత ఉత్సవాల సందడి



సతివాడ పోలమ్మ తల్లి

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలోని కుశాలపురంలో గ్రామదేవత సతివాడ పోలమ్మ తల్లి ఉత్సవాల సందడి నెలకొంది. 15 ఏళ్ల తర్వాత ఈ పండగలు జరుగుతున్నా యి. ఈ నెల 1 నుంచి ఉత్సవాలు ప్రారంభం కాగా ఈ నెల 28తో ముగియనున్నాయి. బంధుమిత్రులతో గ్రామం సందడిగా మారింది.

1600 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

కాశీబుగ్గ: శ్రీకాకుళం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ గంగాధరం ఆదేశాల మేరకు సోంపేట ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ ఆర్.జైభీమ్, పలాస టాస్క్‌ఫోర్స్ బృందంతో కలిసి మందస మండలం కరియాపల్లిలో శుక్రవారం సారాబట్టీలపై దాడులు నిర్వహించారు. 1600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు.

రైల్వేజోన్ జట్టుకు హరీష్ ఎంపిక



హరీష్

హిరమండలం : రైల్వేజోన్ క్రికెట్ జట్టుకు హిరమండలం మండలంలోని గొట్టా గ్రామానికి చెందిన బత్తుల హరీష్ ఎంపికయ్యాడు. ప్రాథమిక స్థాయి నుంచి హరీష్‌కు క్రికెట్ అంటే మక్కువ. ఇటీవల ఫస్ట్ యాక్షన్ టీ20 క్రికెట్ మ్యాచ్‌లకు కూడా ఎంపికై రాణించాడు. ఈ సందర్భంగా హరీష్‌ను గ్రామస్తులు అభినందించారు.

ఇసుక లారీ బోల్తా



జాతీయ రహదారిపై బోల్తా పడిన లారీ

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలెం సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం ఇసుక లారీ బోల్తా పడింది. శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం వెళుతుండగా అదుపు తప్పడంతో ఈ ఘటన చోటు చేసుకుంది. డ్రైవర్, క్లీనర్ సురక్షితంగా బయటపడ్డారు. హైవే సిబ్బంది సహాయక చర్యలు చేపట్టి, ట్రాఫిక్‌ను చక్కదిద్దారు.

పకడ్బందీగా ఘన వ్యర్థాల నిర్వహణ



మాట్లాడుతున్న డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి సన్యాసినాయుడు

శ్రీకాకుళం పాతబస్టాండ్: నగరంలో ఘన వ్యర్థాల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. నగరంలోని న్యాయసదన్‌లో శుక్రవారం ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యర్థాల నుంచి సంపద తయారు చేసే దిశగా శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ అడుగులు వేయాలన్నారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై సరైన అవగాహన కలిగి ఉండాలన్నారు. సమావేశంలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ వెంకటరావు, డిప్యూటీ ఇంజినీర్ కమలాకర్, అసిస్టెంట్ ఇంజినీర్ సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

మామిడికి దెబ్బ



ఇప్పటివరకు మామిడి కాపు సక్రమంగా రాని మామిడి తోట

- వాతావరణ పరిస్థితులతో దిగుబడిపై తీవ్ర ప్రభావం
- ఎకరాకు టన్ను నుంచి ఒకటిన్నర టన్ను మాత్రమే దిగుబడి అంచనా
- మార్కెట్‌లోకి అరకొరగా మామిడి

ఆమదాలవలస రూరల్:

మామిడి రైతులకు చేదు అనుభవాలు మిగుల్చుతోంది. ఈ ఏడాది ప్రతికూల వాతావరణ పరిస్థితులు మామిడి దిగుబడులపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. ఇప్పటికే రెండు నెలలు ఆలస్యంగా కాయలు వస్తున్నా ఆశించిన దిగుబడి మాత్రం రావడం లేదు. దీంతో మార్కెట్‌లోకి అరకొరగా మామిడి దిగుబడి అవుతోంది. నియోజకవర్గంలో పొందూరు, బూర్జ, సరుబుజ్జిలి మండలాల్లో అధికంగా మామిడి సాగు జరుగుతుంది. ఈ ప్రాంతాల్లో పండే బంగినపల్లి, తోతాపురి, సువర్ణ, కలక్టర్, చెరుకు రసాలు, బెంగళూరు కాయలు వంటి మామిడి రకాలకు జిల్లాతో పాటు రాష్ట్రంలో మంచి పేరు ఉంది. ఏటా వేల టన్నుల కాయలను దేశంలో, రాష్ట్రంలో వివిధ ప్రాంతాలకు ఇక్కడి నుంచి ఎగుమతులు అవుతున్నాయి. దాదాపు రెండు, మూడు నెలలపాటు సీజన్ జోరుగా సాగుతుంది. అయితే గత రెండేళ్లుగా సరైన ఎగుమతులు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కరోనా ఆంక్షల నేపథ్యంలో గత రెండేళ్లుగా దెబ్బ తిన్న పంటలకు ఈ ఏడాది దిగుబడులు లేక ఎగుమతులపై ప్రభావం చూపుతోంది.

వాతావరణంతోనే..

ఈ ఏడాది గత జనవరి, ఫిబ్రవరి నెలల్లో అధిక వర్షాలు కురవడంతో మామిడి పూతపై తీవ్ర ప్రభావం పడింది. అధిక వర్షాలతో పూత రావడం దాదాపు నెల రోజులు ఆస్యమైంది. వచ్చిన పూత సక్రమంగా నిలవని పరిస్థితి. కేవలం 30 శాతం పిందె మాత్రమే తోటల్లో వచ్చింది. ఇప్పటికీ కొన్ని తోటల్లో పిందెలు కూడా రాలేదు. సాధారణంగా వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తే ఎకరాకు నాలుగు టన్నుల వరకు కాయలు వచ్చే అవకాశం ఉంది. కానీ ఈ ఏడాది టన్ను నుంచి టన్నున్నర కాయలు మాత్రమే వచ్చే అవకాశం ఉందని ఉద్యానవన శాఖ అధికారులు అంచనాలు వేస్తున్నారు. బాగా దిగుబడి వచ్చిందనుకుంటే రెండు టన్నులు మించి రాదని భావిస్తున్నారు.

ధర ఫర్వాలేదు

రాష్ట్ర వ్యాప్తంగా మామిడి దిగుబడి గణనీయంగా తగ్గిపోవడంతో ధర మాత్రం బాగానే ఉంది. ప్రస్తుతం బంగినపల్లి రకం మామిడి టన్ను రూ. 50 వేలు, సువర్ణ రూ. 65 వేలు, రసాలు రూ. 40 వేలు, కలక్టర్ రకాలు రూ. 20 వేలు పలుకుతుంది. కిలో మామిడి పండ్లు రూ. 50 నుంచి రూ. 90 వరకు రకాలు బట్టి అమ్మకాలు జరుపుతున్నారు. ఈ ధర ఇంకా పెరిగే అవకాశాలు ఉన్నాయని రైతులు అంటున్నారు. అయితే డిమాండ్‌కు తగ్గట్టు కాయలు లేకపోవడంతో రైతులు నష్టపోతున్నారు. ఎకరాకు రెండు టన్నుల లెక్కన దిగుబడి తగ్గినా రూ. లక్ష వరకు నష్టపోవాల్సి వస్తుంది.



మార్కెట్‌లో మామిడిపండ్లు అమ్మకాలు

ఊరికి ఉపయోగపడేలా ఉపాధి పనులు

- రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి శాఖ జాయింట్ కమిషనర్ శివప్రసాద్



మాట్లాడుతున్న జాయింట్ కమిషనర్ శివప్రసాద్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఖర్చు చేసిన ప్రతి పైసా పూర్తిస్థాయిలో సద్వినియోగం అయ్యేలా గ్రామాల్లో ఉపాధి పనులు నిర్వహించాలని గ్రామీణాభివృద్ధి శాఖ జాయింట్ కమిషనర్ ఎం.శివప్రసాద్ సిబ్బందికి సూచించారు. శుక్రవారం శ్రీకాకుళంలోని డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో ఏపీడీలు, ఏపీవోలు, ఈసీలు, టీఏలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలకు ఉపాధి చూపించడంతోపాటు స్థిరాస్తులు సృష్టించడం ఉపాధి పథకం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. చెరువులు, కాలువల్లో పూడికతీత పనులు తగ్గించి భూగర్భ జలమట్టాన్ని పెంపొందించేలా ఖండిత కందకాలు, ఫారం పాండ్స్, సరిహద్దు కందకాలు, వృత్తాకార కందకాలు, రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ వంటి పనులకు ప్రాధాన్యమివ్వాలన్నారు. చెరువుల మెరక భాగాల్లో ఫిష్‌పాండ్ పనులు చేపట్టడం ద్వారా కూలీలకు అధిక ఉపాధి పని దినాలు కల్పించడంతోపాటు ఆయా పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరుతుందన్నారు. ఈ పనులు చేపట్టడం వల్ల వచ్చే ప్రయోజనాలపై రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. కూలీలకు గరిష్ఠ వేతనం వచ్చేలా సిబ్బందికి సాంకేతిక అంశాలపై అవగాహన కల్పించారు. అంతకుముందు రణస్థలం, లావేరు, ఎచ్చెర్ల మండలాల్లో పర్యటించి ప్లాంటేషన్, చెరువు పూడిక తీత పనులు, ఫారం పాండ్ పనులను పరిశీలించారు. సమావేశంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జి.వి.చిట్టి రాజు, ఫైనాన్స్ మేనేజర్ స్వరూపరాణి, విజిలెన్స్ అధికారి బి.లవరాజు, ఏపీడీలు పి.రాధ, మురళీకృష్ణ, శైలజ, లోకేష్, కార్యాలయ సూపరిండెంట్ మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



మాట్లాడుతున్న టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమార్

కోటబొమ్మాళి: శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తే కఠిన చర్యలు తప్పవని టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమార్ హెచ్చరించారు. శుక్రవారం కోటబొమ్మాళి మండలం తిలారు గ్రామంలో శాంతిభద్రతలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 4న ఎన్నికల ఫలితాలు వెలువడుతున్నందున గ్రామస్తులు సామరస్యంగా మెలగాలని, ఎటువంటి తగాదాలు పెట్టుకోవద్దని హితవుపలికారు. టెక్కలి డీఎస్పీ బాలచంద్రారెడ్డి మాట్లాడుతూ గొడవలకు దిగితే ఎలాంటి వారినైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి.లచ్చపాత్రుడు, ఎంపీడీఓ వై.పద్మజ, ఈఓపీఆర్‌డీ బి.రామారావు, సీఐ సూర్యచంద్రమౌళి, ఎస్‌ఐ మహమ్మద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

చెట్టుకు ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య



జీడి చెట్టుకు వేలాడుతున్న మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ రామారావు

వజ్రపుకొత్తూరు: మండలంలోని అనంతగిరి పంచాయతీ వెంకటాపురం జీడితోటల్లో శుక్రవారం గొర్లె ఉమామహేశ్వరరావు(26) అనే వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న వజ్రపుకొత్తూరు ఎస్‌ఐ సీహెచ్.రామారావు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. అక్కడున్న ఐడీకార్డు ఆధారంగా మృతుడు విశాఖపట్నంలోని నావల్ డాక్‌యార్డులో లేబర్‌గా పనిచేస్తున్నట్లు గుర్తించారు. ఆనవాళ్లను బట్టి గురువారం రాత్రి ఉరి వేసుకున్నట్లు అనుమానిస్తున్నారు. గుర్తింపు కార్డు తప్ప మరేలాంటి ఆధారాలు దొరక్కపోవడంతో వివరాల కోసం నావల్ డాక్‌యార్డును సంప్రదిస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు. మృతుడు ఎరుపు చారలతో ఉన్న తెలుపు టీ షర్టు, నలుపు షార్టు(నిక్కర్)ధరించినట్లు చెప్పారు. మృతదేహాన్ని పలాస ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించామని, వివరాలను తెలిసిన వారు వజ్రపుకొత్తూరు పోలీసులను సంప్రదించాలని కోరారు. వీఆర్‌ఓ రెయ్యిమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కంటెయినర్ ఢీకొని వివాహిత దుర్మరణం

- కుమార్తె కాలేజీ ఫీజు చెల్లించడానికి వచ్చి మృత్యువాత



బైక్‌ను ఢీకొట్టిన కంటెయినర్

తగరపువలస: ఆనందపురం మండలం పెద్దిపాలెం జాతీయరహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో విజయనగరం జిల్లా ఎల్.కోటకు చెందిన సావర్ల నవ్య అనే వివాహిత మృతి చెందింది. ఆనందపురం పోలీసులు తెలిపిన వివరాలివీ.. పెద్దిపాలెం నారాయణ కళాశాలలో నవ్య కుమార్తె ఝాన్సీ చదువుతోంది. కుమార్తె ఫీజు చెల్లించడానికి గానూ కుమారుడు రాజు, కుమార్తెతో కలిసి ఆమె ద్విచక్రవాహనంపై పెద్దిపాలెం వస్తోంది. అదే సమయంలో హైదరాబాద్ నుంచి రాంచీ వెళుతున్న చాక్లెట్ల కంటెయినర్ గోకార్టింగ్ సమీపంలో బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నవ్య అక్కడికక్కడే మృతి చెందగా.. రాజు, ఝాన్సీ గాయపడ్డారు. ఆనందపురం ట్రాఫిక్ ఎస్‌ఐ సునీల్ ఫిర్యాదుతో సీఐ టి.తిరుపతిరావు కేసు నమోదు చేస్తున్నారు.

కాశీబుగ్గలో భారీ చోరీ



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

- రూ.45 లక్షల విలువైన సొత్తుతో దొంగలు పరార్
- రంగంలోకి దిగిన క్లూస్‌టీం

కాశీబుగ్గ : కాశీబుగ్గ రోటరీనగర్‌లో గురువారం అర్ధరాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. తాళం వేసిన ఇంట్లో చొరబడి డైమండ్స్‌తో కూడిన 40 తులాల బంగారు ఆభరణాలు దోచుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 17వ వార్డు రోటరీనగర్‌లో నివాసముంటున్న చాప అలివేలు వజ్రపుకొత్తూరు మండలం ఎంఎస్‌ఆర్‌ఈజీఎస్ కార్యాలయంలో టెక్నికల్ అసిస్టెంట్ గా పనిచేస్తోంది. గురువారం విధులు ముగించుకు ని తన స్వగ్రామమైన నందిగాం మండలం హరిదాసుపురం చేరుకుని అక్కడే రాత్రి బస వేసింది. ఇదే అదునుగా గుర్తు తెలియని వ్యక్తులు రోటరీగనర్‌లో ని ఆమె ఇంటి తాళాలు పగలగొట్టి లోపలికి చొరబడ్డారు. రెండు అలమరాలతో పాటు, బీరువాను పగలు కొట్టి అందులో ఉన్న ఆభరణాలు, నగదు దోచుకుపోయారు. అందులో రూ.17లక్షల విలువైన డైమండ్‌తో కూడిన 40 తులాల బంగారం, 10 తులాల వెండి వస్తువులు, రూ.18వేల నగదు ఉన్నట్లు పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలింది. చోరీ జరిగిన సొత్తు విలువ రూ.45 లక్షలకు పైగా ఉంటుందని అంచనా వేశారు. కుమార్తె పెళ్లి కోసం కష్టపడి దాచుకున్న సొత్తు దొంగల పాలైందంటూ బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది. ఈమె భర్త సీఆర్‌పీఎఫ్ జవాన్‌గా ప్రస్తుతం ఎన్నికల విధులలో ఉన్నారు. కుమార్తె బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పని చేస్తోంది. విషయం తెలుసుకున్న కాశీబుగ్గ ఎస్‌ఐ పారినాయుడు, క్రైం హెచ్‌సీ శ్రీనివాసరావు, క్లూస్‌టీం ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

అధికార లాంఛనాలతో జవాన్ అంత్యక్రియలు



రాజగోపాలరావు (ఫైల్)



అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆమదాలవలస రూరల్: మండలంలోని కొర్లకోట గ్రామానికి చెందిన సీఆర్‌పీఎఫ్ జవాన్ పేడాడ రాజగోపాలరావు(33) అనారోగ్యం కారణంగా గురువారం హైదరాబాద్‌లో మృతిచెందారు. ఈయన పార్థివదేహాన్ని స్వగ్రామం కొర్లకోటకు శుక్రవారం తీసుకొచ్చారు. బెటాలియన్ నేతృత్వంలో అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. రాజగోపాలరావుకు భార్య, నాలుగేళ్ల కుమార్తె ఉన్నారు. జవాన్ మృతితో కొర్లకోటలో విషాదఛాయలు అలముకున్నాయి.



భరతనాట్య ప్రదర్శన

ముత్యాలమ్మ తల్లికి నృత్యార్చన

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని కాకివీధిలో జరుగుతున్న ముత్యాలమ్మ తల్లి పండగల సందర్భంగా శుక్రవారం నిర్వహించిన కోలాటం, నృత్యార్చనలు ఆకట్టుకున్నాయి. రాగశ్రీనివాస కోలాట బృందం వ్యవస్థాపకులు లింగం గిరిజా శేషు శిష్యబృందం 30 మంది కోలాట ప్రదర్శనతో అమ్మవారికి అర్చన చేశారు. అభినయ నృత్యనికేతన్ దర్శకురాలు డాక్టర్ నీరజా సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో భరతనాట్యం, కోలాట ప్రదర్శన నిర్వహించారు.

కొనసాగుతున్న దర్యాప్తు

సారవకోట: మండలంలోని ధర్మలక్ష్మీపురం సమీపంలో ఇటీవల పోలీసులమని చెప్పి అనకాపల్లి జిల్లా మామిడిపల్లికి చెందిన మణికంఠ అనే క్రాంటాక్టర్ నుంచి రూ.10 లక్షలు దోచుకుపోయిన ఘటనకు సంబంధించి కేసు దర్యాప్తు కొనసాగుతోంది. ఈ దోపిడీలో పాల్గొన్న వారంతా ఒక్కొక్కరు ఒక్కో చోట ఉంటూ స్కెచ్ వేసినట్లు సమాచారం. ఒకరికొకరు సమాచారం చేరవేసుకుంటూ దోపిడీకి పథక రచన చేసుకుని పకడ్బందీగా అమలు చేశారు. సస్పెన్షన్‌కు గురై ఉద్యోగం పోగొట్టుకున్న పోలీసుకు సైతం ఈ దోపిడీలో ప్రమేయం ఉండటంతో అతని కోసం గాలింపు జరుగుతున్నట్లు తెలుస్తోంది. బాధితుడి నుంచి దోచుకెళ్లిన నగదులో కొంత మేర రికవరీ చేసినట్లు సమాచారం.

ఉజ్వల భవితకు పునాదులు

- ప్రీ ప్రైమరీ స్కూల్స్‌గా 3,358 అంగన్‌వాడీ కేంద్రాలు
- 84,031 మంది చిన్నారులకు సేవలు



చిన్నారులకు విద్యాబోధన చేస్తున్న అంగన్‌వాడీలు

శ్రీకాకుళం అర్బన్: అంగన్‌వాడీ కేంద్రాలు చిన్నారుల భవిష్యత్తుకు బంగారు బాటలుగా నిలుస్తున్నాయి. పౌష్టికాహారం అందిస్తూ ఆరోగ్య, మానసిక వికాసానికి ఎంతగానో తోడ్పడుతున్నాయి. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత అంగన్‌వాడీ కేంద్రాలను నాడు–నేడు పథకం కింద ఉన్నతంగా తీర్చిదిద్దారు. నూతన భవనాలను నిర్మించి వాటి రూపురేఖలను మార్చడంతో పాటు చిన్నారులు ఉత్సాహంగా ఆటపాటలతో కూడిన విద్యను నేర్చుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు.

సృజనాత్మకతతో విద్య..

అంగన్‌వాడీ కేంద్రాలలో 3 నుంచి 5 ఏళ్లలోపు చిన్నారులకు సృజనాత్మక విద్యను అందిస్తున్నారు. చిన్న చిన్న ఆంగ్ల పదాలు, బొమ్మలు వేయడం వంటివి నేర్పిస్తున్నారు. ప్రవేటు పాఠశాలల్లో చదువుకునే పిల్లలు కూడా అంగన్‌వాడీ కేంద్రాలలో చేరుతుండడం విశేషం. ప్రీ ప్రైమరీ విద్య నాణ్యతతో కూడినదిగా అందిస్తే ఆ బిడ్డ భవిష్యత్తు అంత ఉజ్వలంగా ఉంటుందని నమ్మిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఈ కేంద్రాలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. మరోవైపు ప్రవేటు పాఠశాలల్లో కిండర్ గార్డెన్ స్కూళ్ల ఏర్పాటు చేసి వేలకు వేలు రూపాయలు ఫీజులుగా వసూలు చేస్తున్నాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీ ప్రైమరీ స్కూళ్లుగా రూపుదిద్దుకునేలా చేశారు. గతంలో అంగన్‌వాడీ కేంద్రాలన్నీ చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించేందుకే పరిమితమైన విషయం తెలిసిందే.

ఆకట్టుకునేలా విద్యాబోధన:

అంగన్‌వాడీ కేంద్రాలను రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రీ ప్రైమరీ స్కూళ్లుగా తీర్చిదిద్దింది. చిన్నారులకు అర్థమయ్యేలా ప్రత్యేక సిలబస్‌ను రూపొందించి అంగన్‌వాడీ టీచర్లకు ప్రత్యేక శిక్షణ కూడా ఇచ్చారు. ఇంగ్లీషు, మ్యాథ్స్, వర్క్‌బుక్, యాక్టివిటీ పుస్తకాలను సైతం అందించారు. చిన్నారులను ఆకట్టుకునేలా బొమ్మలతో కూడిన పుస్తకాలను తయారుచేశారు. వివిధ రకాల ఆటపాటలు, బొమ్మలతో బోధన సాగుతోంది.

పూర్తిస్థాయిలో సౌకర్యాలు



అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు చదువుతో పాటు ఆటపాటలు నేర్పించేందుకు అన్ని సౌకర్యాలనూ ప్రభుత్వం సమకూర్చింది. దీంతో చిన్నారులు ఆసక్తిగా కేంద్రాలకు వస్తున్నారు.

– బి.శాంతిశ్రీ, ఐసీడీఎస్ పీడీ

కేంద్రాలు బాగున్నాయి..



ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాలు ఎంతో బాగున్నాయి. గతంలో సరైన మౌలిక సదుపాయాలు లేక పిల్లలను కేంద్రాలకు పంపించాలనే ఆలోచన వచ్చేది కాదు. ఇపుడు పౌష్టికాహారంతో చదువుకునేందుకు పుస్తకాలు, ఆడుకునేందుకు బొమ్మలు అన్నీ ఉంటున్నాయి.

– యాళ్ల యశోద, చిన్నారి తల్లి